ఆంజనేయుడికి ప్రత్యేక అలంకరణ

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలోని సంకట విమోచన ఆంజనేయ స్వామికి అమావాస్య తిథి సందర్భంగా సోమవారం వెన్న, డ్రైఫ్రూట్స్‌తో అలంకరించి, అర్చకులు తులసీరమణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈవో రవీందర్‌రెడ్డి, క్లర్క్ సుధాకర్ పాల్గొన్నారు.

గో సేవతో పుణ్యఫలం

రామంతాపూర్ : చిన్న చెరువు ప్రాంగణంలోని పాండురంగస్వామి గో సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా గోసేవా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు చేశారు. అన్నప్రసాద వితరణకు కాంగ్రెస్ నేత బొప్పన పల్లి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గో సేవతో పుణ్య ఫలం లభిస్తుందని మనస్సుకు శాంతి కలిగే అధ్యాత్మిక భావనలు పెంపొందించి ఆరోగ్యం, ఆనందం కలుగుతుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మల్కాజిగిరి: మౌలాలి డివిజన్ నర్సింగరావు కాలనీ నూతన కార్యవర్గం ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో ఎన్నికైంది. అధ్యక్షుడిగా వెంకటరెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ.. కాలనీవాసులు ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సలహాదారుడిగా కృపాసాగర్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్, అశోక్, రాజుగౌడ్, సహాయ కార్యదర్శులుగా గణేష్, వేణుగోపాల్, రాజ్యలక్ష్మి, కోశాధికారిగా కిషోర్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సలీమ్ , నజీమాను ఎన్నుకున్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

గౌతంనగర్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అంకితభావంతో పనిచేసినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందని, మల్కాజిగిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రాజు అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ డీపీ సత్యనారాయణ సోమవారం పదవీవిరమణ కార్యక్రమాన్ని లక్ష్మీసాయిగార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. పలువురు అధికారులు, సిబ్బందితో కలిసి డీపీ సత్యనారాయణను సత్కరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

కుషాయిగూడ: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నింబధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కుషాయిగూడ, చర్లపల్లి ఇన్‌స్పెక్టర్లు అంజయ్య, రవికుమార్ తెలిపారు. వేడుకల పేరుతో జనజీవనానికి ఆటంకం కలిగించొద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల విక్రయాలు, వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. న్యూ ఇయర్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులతో పంచుకోవద్దన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు కాల్ చేయాలని వివరించారు.

మేడిపల్లి పీఎస్‌లో పెరిగిన మిస్సింగ్ కేసులు

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం 1505 కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా అదృశ్యం కేసులు 256 కాగా వాటిలో 224 ట్రేస్ చేశారు. దొంగతనాలు 180, రికవరీ 148, సైబర్‌క్రైమ్ 127, రోడ్డుప్రమాదాలు 126 గంజాయి కేసుల్లో దొరికిన గంజాయి మొత్తం 14.375 కిలోలు, దోపిడీ, చైన్ స్నాచింగ్ కేసులు మొత్తం 8 కాగా ఛేదించినవి 8, ఇతర కేసులు 570 ఉన్నాయి. మొత్తం రూ.1.7 కోట్లకు రూ.63 లక్షలను పోలీసులు రికవరీ చేశారు.

ప్రతి కుల సంఘానికి వైకుంఠ ధామం

ఉప్పల్: ప్రతి కుల సంఘానికి ఒక వైకుంఠ ధామం ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ హామీ ఇచ్చారు. దాదాపుగా 674 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వారికి సరిపడా నిధులను కేటాయించేందుకు సహకరించాలని కోరుతూ సోమవారం చిలుకానగర్ కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఈ ఏడాది సైబర్ క్రైమ్‌లే టాప్ !

ఉప్పల్‌లో మొత్తం 1630 కేసులు

ఉప్పల్/ కుషాయిగూడ/ మల్లాపూర్/ మేడిపల్లి: సాయుధ బలగాలతో విజబుల్ పోలీసింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చినా, కేటుగాళ్లు తెలివి మీరి ఎత్తుకు పైఎత్తు వేస్తూ.. బ్యాంక్ ఖాతాలను గుల్ల చేస్తున్నారు. పెట్రోల్ మొబైల్, బ్లూకోట్స్, సీసీకెమెరాల ఏర్పాటు, వాహనాల తనిఖీలు చేసినప్పటికీ నేరగాళ్లు రూటు మార్చి తమ పంథాన్ని నెగ్గించుకుంటూ పోలీసులకు సవాలు విసురుతున్నారు.

- సైబర్ క్రైమ్‌కు సంబంధించి 142 కేసులు నమోదు కాగా.. వాటిలో దాదాపు లక్షలాది రూపాయాలను కేటుగాళ్లు కొల్లగొడుతున్నారు. 281 వరకు మిస్సింగ్ కేసులుండగా.. అందులో 263 మంది ఆచూకీ లభించింది. రోడ్డు ప్రమాదాలు 121 చేసుకోగా.. 130 మంది గాయపడితే 17 మంది మృతి చెందారు. దాదాపుగా 18 వరకు మృతి చెందారు.
- ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 239 దొంగతనాలు జరిగితే 137 కేసులను పోలీసులు గుర్తించగలిగారు. ఆత్మహత్యలు 98 , అత్యాచారాలు 12, లైంగిక వేధింపులు 102 జరిగాయి. 7 హత్యలు జరగగా.. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కిడ్నాప్‌లు 39లో 38 వరకు పోలీసులు ఛేదించారు. ఇతర కేసులు కలిపి మొత్తం 1630 కేసులు ఈ ఏడాదిలో నమోదు చేశారు.

రూ.100 కోట్లకు పైగా మోసాలు..

- సంచలనం సృష్టించిన జేవీ ఇన్‌ఫ్రా చీటింగ్ కేసులో దాదాపు రూ. 100 కోట్లకు పైగా మోసాలు, 200లకు పైగా బాధితులు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇది నగరంలో అతిపెద్ద క్రైమ్.
- రామంతాపూర్ ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్‌లు అన్నం పెట్టిన సంస్థకే సున్నం పెట్టారని వార్తలు వెలువడ్డాయి. తాము పనిచేస్తున్న సంస్థకే టోకరా ఇచ్చి దాదాపుగా రూ. 3 కోట్లకు పైగా ఎగనామం పెట్టిన భగీరథ గంగా మల్లయ్య, షేక్ సైదులు జైలుపాలైన ఘటనలు ఉన్నాయి.
- బూట్ల దొంగతనం కేసు కూడా రామంతాపూర్‌లో మరో సంచలనం సృష్టించింది. భార్య మందు సేవించి పోలీసులను ముప్పు తిప్పలు పెడితే భర్త మాత్రం ఇళ్లలోని షూరాక్‌ల నుంచి బూట్లు దొంగతనం చేసి ఇంట్లో గుట్టలు గుట్టలుగా పేర్చిన కేసు అందరినీ ఆశ్చర్యపరిచింది.

కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

నమోదైన కేసులు 882

- గతేడాదితో పోలిస్తే ఈసారి కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. గతంలో 1079 కేసులు నమోదు కాగా, ఈసారి 882 కేసులు నమోదయ్యాయి. కేసుల సంఖ్య తగ్గినప్పటికీ ప్రాపర్టీ రికవరీ శాతం గతేడాది 72.21 శాతం ఉండగా.. ఈసారి 66.84 శాతంగా ఉంది. ఎస్‌ఎల్‌ఎల్ కేసులే 334 నమోదయ్యాయి.



అల్వాల్ పోలీస్‌స్టేషన్

- ప్రధానంగా రేషన్‌బియ్యం అక్రమ రవాణా, నకిలీ వస్తువుల విక్రయాలు, గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్, నిషేధిత వస్తువుల అమ్మకాలు వంటివి అధికంగా ఉన్నాయి. ఇక 248 రోడ్డు ప్రమాదాలు, 13 హత్యాయత్నం కేసులు, 13 కిడ్నాప్ కేసులు, 81 ఇళ్లలో ఉదయం, రాత్రి సమయాలో దొంగతనాలకు సంబంధించి 81 కేసులు నమోదయ్యాయి.
- 8 గంజాయి కేసులు నమోదు చేసి సుమారు 14 కిలోల గాంజాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది సైబర్ నేరాలు కూడా పెరిగిపోయాయి. సుమారు 120 కేసుల వరకు సైబర్ నేరాలు నమోదయ్యాయి.
- ఈ ఏడాది పలు కేసుల్లో రూ.84,56,532 నగదు బాధితులు నష్టపోగా.. రూ.56,52,419 రికవరీ చేశారు.

చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో..

- చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈసారి 400 కేసులు నమోదయ్యాయి. వాటిలో 48 రోడ్డు ప్రమాదాల కేసులే అధికంగా ఉన్నాయి. 1 హత్య, 12 అత్యాచారాలు, 31 ఆత్మహత్యలు, 8 లైంగిక వేధింపులు, 1 చైన్‌స్నాచింగ్, 8 కిడ్నాప్, 41 మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి.

నాచారం పోలీస్‌స్టేషన్‌లో..

మొత్తం 784 కేసులు

- గతేడాదితో పోలిస్తే ఈసారి 111 కేసులు అదనంగా పెరిగాయి. అదృశ్యం కేసులు 138, రాత్రి దొంగతనాలు 04, సాధారణ దొంగతనాలు 52, కిడ్నాప్‌లు 10, మానభంగాలు 04, మోసాలు 62, రోడ్డు ప్రమాదాలు 13, సాధారణ బీఎన్‌ఎస్ కేసులు 121 వరకు నమోదయ్యాయి. సాధారణ రోడ్డు ప్రమాదాలు 49 గతేడాదితో మిస్సింగ్ కేసులు పోలిస్తే ఈసారి కుడా 138 కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. దాదాపుగా రూ.42 లక్షల విలువైన నగదు బాధితులు పోగొట్టుకోగా.. రూ.29 లక్షలను రికవరీ చేశామని నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్విర్‌కుమార్ వివరించారు.



రికవరీ వస్తువుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో రాహుల్‌దేవ్ (ఫైల్)

అల్వాల్‌లో పెరిగిన నేరాలు..

20 శాతానికి పెరిగిన వైనం

అల్వాల్: అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో గతేడాది కంటే 20 శాతానికి పెరిగాయి. గతేడాదిలో 800 ఉండగా.. ఈ ఏడాది 1020 కేసులు నమోదయ్యాయి. వీటిల్లో అధికశాతం సైబర్ క్రైమ్, అదృశ్యం కేసులున్నాయి. ఈ కేసుల్లో 90 శాతానికి పైగా రికవరీ అయ్యాయి. 110 దొంగతనం, 100కు పైగా మోసాలు, 10 హత్య, 10 హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. రోడ్డు ప్రమాదాలు 50, అగ్ని ప్రమాదాలు 5 చోటు చేసుకున్నాయి. ఆత్మహత్య కేసులు 80 , 150 సైబర్ క్రైమ్ కేసులు ఉన్నాయి. 70కి పైగా తగాధాల కేసులు నమోదయ్యాయి. దొంగతనం కేసుల్లో 60 శాతానికి పైగా రికవరీ చేసినట్లు పోలీసులు వివరించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

అన్ని వర్గాల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నాం. కాలనీలు, ప్రధాన రహదారుల్లో సీసీ కెమోరాల ఏర్పాటుతో పాటు నిరంతరం నిఘా పెంచుతున్నాం. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– రాహుల్‌దేవ్, అల్వాల్ ఎస్‌హెచ్‌వో

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

మల్కాజిగిరి: మారుతీనగర్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని స్థానికులు, అసోసియేషన్ ప్రతినిధులు కార్పొరేటర్ శ్రవణ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం కాలనీలో పర్యటించిన సమయంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కమర్షియల్ ప్రాంతంలో పార్కింగ్ సమస్యలతో ఇబ్బందులకు గురౌతున్నామని చెప్పడంతో ట్రాఫిక్ సీఐకి తగిన చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. ఇనుప విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని వాటి స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటు చేయాలని స్థానికులు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. తాగునీటి సరఫరా కూడా తగినంత రావడం లేదని, చెప్పడంతో తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో డీసీకి వినతిపత్రం అందజేశారు. శంకు, మూర్తి, జయకృష్ణ, సుబ్రహ్మణ్యం , గణేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

ప్రభుత్వ స్థలాన్ని పాఠశాలకు కేటాయించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: సర్వేనంబర్ 63/1 దేవేందర్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలకు కేటాయించాలని 12వ డివిజన్ కార్పొరేటర్ కల్యాణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ రామలింగంకు ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇటీవల కబ్జాకు యత్నిస్తున్నారనే సమాచారంతో మున్సిపల్, మండల రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాన్ని కాపాడారన్నారు. పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉందని, సదరు స్థలాన్ని పాఠశాలకు విద్యార్థుల ఆటస్థలం కోసం కేటాయించాలని కోరారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

మల్లాపూర్: సీసీరోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అన్నారు. సోమవారం నాచారం ఓల్డ్ విలేజ్‌లో రూ.54 లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాచారం ఓల్డ్ విలేజ్‌లో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, సీసీరోడ్లు తదితర అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. బీఆర్‌ఎస్ నేతలు భూపాల్‌రెడ్డి, సాయిబాబా, ప్రేమ్‌కుమార్, సత్తయ్య, యాదగిరి, జగత్, భరత్, ప్రశాంత్, శ్యామ్, సాయి, నరేందర్, సన్నీ, శ్రీనివాస్, కృష్ణ, బాలకృష్ణ పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్

బీరప్ప ఆలయ నూతన కమిటీ



రామంతాపూర్: కురుమ సంఘం నేతలైన గొరిగి మల్లేష, కంకాల ఏలేందర్, కృష్ణయ్య, సాగర్, శ్రీనివాస్, రేవ్ల నరసింహ, శ్రీశైలం సమక్షంలో సోమవారం స్థానిక కామరాతి బీరప్ప దేవాలయ కమిటీ, ఇతర కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా శాగ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా బాలం బిక్షపతి నియమితులయ్యారు.

- రేణుకాఎల్లమ్మ ఆలయ అధ్యక్షుడిగా బీరప్ప, కుర్మ సంఘం అధ్యక్షుడిగా జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా బండ అంజయ్య ఎంపికయ్యారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని అల్వాల్, మల్కాజిగిరి సర్కిళ్ల పరిధిలోని సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సోమవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. మచ్చబొల్లారంలోని 7 కాలనీల నీటి సరఫరా, వరద ముంపు, డ్రేయిన్ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. శ్రీదాం కాలనీలో సమస్యాత్మకంగా మారిన వరదనీటి ముంపును నివారించేందుకు బాక్స్‌డ్రైన్ నిర్మించాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా నియోజకవర్గానికి నిధులు కేటాయించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. కార్పొరేటర్ విజయశాంతిశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జోలి రమేష్, అనిల్‌కిషోర్, విజయ్‌శేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయం



గణేష్‌నగర్ బీర్షెబా చర్చిలో..



మాట్లాడుతున్న మందుముల పరమేశ్వర్‌రెడ్డి

రామంతాపూర్: సమస్త మానవాళికి క్రీస్తు బోధనలు ఆచరణీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రేమ, క్షమాగుణాన్ని కరుణను పంచే పండుగ క్రిస్మస్ అన్నారు. యాదవ సంఘం రామంతాపూర్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాస్టర్లు రవీందర్‌రెడ్డి, జాన్ ముల్లర్, కిరణ, ఇజ్రాయిల్, జైపాల్, జాష్టువా, శామ్యూల్, ప్రకాష్, చంద్రమోహన్, మనోజ్, సురేష, ఇమ్మాన్యుయేల్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో..

ఉప్పల్: ఉప్పల్ గణేష్‌నగర్‌లోని బీర్షెబా చర్చిలో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేవుడు క్షమాపణ అనే గుణంతో తిరిగి భూమిపైకి వచ్చాడన్నారు. మనోహర్, వరప్రసాద్, దేవదానం, జోసెఫ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

రెండు కిలోలు స్వాధీనం



కుషాయిగూడ: ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో ఓ నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సోమవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రవి తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్, చెంగిచర్ల, చక్రిపురంతో పాటుగా చర్లపల్లి పారిశ్రామికవాడలో వాహనాల తనిఖీలు చేపట్టారు. చర్లపల్లి శ్రీకృష్ణ కన్వెన్షన్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ యువకుడిని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. అతడు బిహార్‌కు చెందిన చందన అనే యువకుడని, అతడి నుంచి 2 కిలోల గంజాయి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్సైలు నందిని, సంగీత ఉన్నారు.

భవనంపై నుంచి పడి బాలుడి మృతి

కుషాయిగూడ: ప్రమాదవశాత్తు ఐదంతస్తుల భవనంపై నుంచి పడి ఓ బాలుడు మృతి చెందిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కాప్రా సాకేత్, మేఫిల్‌లో నివాసం ఉంటున్న మన్నావత్ సీతారాంకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అతడి చిన్న కుమారుడు ఆర్యన్ చిద్రుప్ (9) 4వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు వెళ్లిన అతను భవనం పైనుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

కేలండర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రామంతాపూర్: వంశరాజ్ సంక్షేమ సంఘం రూపొందించిన నూతన సంవత్సర 2025 కేలండర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బండారి శ్రీవాణి వెంకట్‌రావులు పాల్గొని సోమవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కులసంఘాలు తమ కుల అభివృద్ధికి పాటుపడుతూ.. సామాజిక సేవలో పాల్గొని పేదవారికి సహాయపడాలని సూచించారు. రాష్ట్ర బీఆర్‌ఎస్ నేత గంధం నాగేశ్వర్‌రావు, చిటికల కృష్ణయ్య, అధ్యక్షులు బాలస్వామి, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, ఉపాధ్యక్షులు వెంకటయ్య, కోశాధికారి చందు, వేణు, బాలు, రామకృష్ణ, వీరస్వామి పాల్గొన్నారు.

మల్లాపూర్: 'టీని ఇండస్ట్రీస్ అసోసియేషన్' నాచారం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 కేలండర్‌ను సోమవారం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. టీని అసోసియేషన్ చైర్మన్ జయరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్ కుమార్, వైస్ చైర్మన్ చింతరాజు, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌గౌడ్, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, భీష్మ, రమేష్ పాల్గొన్నారు.



మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

బోడుప్పల్: ఆదిమూలం రమాదేవి, కరుణాకర్ రూపొందించిన 13వ డివిజన్ 2025 కేలండర్‌ను ఎంపీ ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బోడుప్పల్ బీజేపీ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు వేణుగోపాల్, నర్సింహ్మ, తిరుమలేష్, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

◆ తల్లీకూతురి అదృశ్యం

అల్వాల్: తల్లీకూమార్తె అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ జేజేనగర్‌లో నివసించే నవీన్, భార్య రమ్య (29), కుమార్తె జయశ్రీ (2)తో కలిసి నివాసం ఉంటున్నారు. రమ్య ప్రైవేట్ ఉద్యోగి. కాగా.. ఆమె తరచుగా ఫోన్‌లో మాట్లాడుతుందని భర్త మందలించాడు. దీంతో కుమార్తెను తీసుకుని వెళ్లి తిరిగిరాలేదు. దీంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ గుండెపోటుతో మేస్త్రీ మృతి

కుషాయిగూడ : గుండెపోటుతో ఓ మేస్త్రీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, కందుకూర్‌కు చెందిన కంచర్ల కృష్ణ (45) బతుకుదెరువు కోసం వచ్చి మేస్త్రీ పనిచేసుకుంటూ.. హెచ్‌బీకాలనీ ఫేజ్–2లో నివాసం ఉంటున్నాడు. కంచర్ల మంగమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడేళ్ల కుమార్తె ఉండగా.. మొదటి భార్యకు ఓ కుమారుడు ఉన్నాడు. సోమవారం ఉదయం ఛాతీలో నొప్పిగా ఉందని, అంతలోనే కుప్పకూలిపోయాడు. దీంతో 108కి సమాచారం ఇవ్వగా.. పరీక్షించిన సిబ్బంది అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ భార్యభర్తల మధ్య గొడవ..

భార్య మెడకు టవల్ చుట్టి హత్య

అల్వాల్: డబ్బుల విషయంలో గొడవపడిన భార్య మెడకు టవల్ బిగించి భర్త హత్య చేసిన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట సిరికొండకు చెందిన గన్నారపు మనోహర్ (32) శోభ (30)లు భార్యభర్తలు. కాగా 30 ఏళ్ల క్రితం నగరానికి వలస వచ్చి నేరేడ్‌మెట్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు సంతానం. నీటి వ్యాపారం చేసే మనోహర్ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేయాలని భార్యకు చెప్పి ఇంట్లో ఉన్న డబ్బులను ఇవ్వమన్నాడు. ఈ విషయంలో ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆవేశంలో భార్యను కొట్టడంతో పాటు ఆమె మెడకు టవల్ బిగించి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

◆ జైలులో ఖైదీ మృతి..

మృతుడు హత్య కేసులో నిందితుడు

కుషాయిగూడ: చర్లపల్లి జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన పోచయ్య హత్య కేసులో నిందితుడు. అతడితో పాటు భార్య, కుమారుడు కూడా ఇదే కేసులో నిందితులు. ఏడాది క్రితం జగిత్యాల కోర్టులో వారికి యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ.. మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. కరీంనగర్ జైలులో ఉన్న వారిని ఏడాది క్రితమే చర్లపల్లి జైలుకు తరలించారు. గత శనివారం జైలులో అనారోగ్యానికి గురైన పోచయ్యను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ.. మృతి చెందినట్లు జైలు పర్యవేక్షణాధికారి రామచంద్రం తెలిపారు. అతడి మృతిపై చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామన్నారు. మృతుడి వివరాలను జైలు అధికారులు, చర్లపల్లి పోలీసులు గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

శిక్షణతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు



పోస్టర్ ఆవిష్కరణలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేయనున్న సెట్విన్ సెంటర్‌లో శిక్షణ పొందిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సెట్విన్ సెంటర్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ కోర్సులు ప్రవేశపెట్టి ఉపాధి కోసం శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నేతలు పాల్గొన్నారు.